సాక్షి
ఖమ్మం

బుధవారం ׀ 2 ׀ జూలై ׀ 2025



లోటు వర్షపాతమే..

జిల్లాలో గడిచిన జూన్ నెలలో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో పంటల సాగు ఇంకా ఊపందుకోలేదు. 8లో



లాభం ఎంత.. నష్టం ఎంత?

ఖమ్మంలో మున్నేటిపై ఉన్న చెక్‌డ్యాంలను కూల్చివేయాలా, ఎత్తు తగ్గించాలా అన్న అంశంపై అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 24°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

మధిర: డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం మధిర మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10–45 గంటలకు మధిరకు చేరుకోనున్న ఆయన అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షిస్తారు. ఆతర్వాత మండలంలోని వంగవీడు సమీపాన వైరా నదిపై రూ.600 కోట్లతో నిర్మించే జవహర్ లిఫ్ట్ స్కీమ్‌కు శంకుస్థాపన చేస్తారు. అలాగే, మధిర ట్యాంక్ బండ్‌పై రూ.6.45 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 4–30 గంటలకు ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత 5గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి వరంగల్ క్రాస్‌రోడ్డులో ఆధునికీకరించిన ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించాక ఎంపీడీఓ కార్యాలయంలో కేబుల్ బ్రిడ్జి భూనిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. అనంతరం ఏదులాపురంలో రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

డీసీసీబీ ఉద్యోగుల వేతన సవరణ

- 26–29 శాతం మేర పెరిగే అవకాశం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఉద్యోగుల వేతన సవరణపై ఒప్పందం కుదిరింది. ఈ అంశంపై ఉద్యోగులు మూడేళ్లుగా ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యాన హైదరాబాద్‌లో డీసీసీబీ ఉద్యోగ యూనియన్ల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రస్తుత వేతనాలపై 26నుంచి 29 శాతం మేర సవరణకు నిర్ణయించి, 2022 నవంబర్ 1నుంచి అమయ్యేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ చర్చల్లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, నున్నా సందర్‌రావు, జె.అనిల్‌కుమార్, అఫ్జల్, పి.మంగయ్య, రవీందర్‌కుమార్, డి.రవి, ఎస్.కే.జానీమియా, స్రవంతి, బి.రవికుమార్, పి.వెంకట్రామయ్య, జి.క్రాంతి, ప్రకాష్ పాల్గొన్నారు. కాగా, వేతన సవరణ ఒప్పందాన్ని డీసీసీబీల్లో తీర్మానించాల్సి ఉంటుంది.

చెల్లింపులు లేవు..



ఖమ్మం - రఘునాథపాలెం మధ్య నిలిచిపోయిన నాలుగు లేన్ల విస్తరణ పనులు

- భారం మోయలేమంటున్న ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్లు
- రూ.100 కోట్లకు పైగా బిల్లులు పేరుకుపోవడంతో నిరాశ
- ఫలితంగా నిర్మాణాల్లో జాప్యం.. కొత్త పనులపై నిర్వేదం

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నుండి నెలల తరబడి బిల్లులు రాకపోవడం.. అవి రూ.కోట్లలో పేరుకుపోవడంతో పనులు చేయలేమంటూ కాంట్రాక్టర్లు రహదారి నిర్మాణ పనులను నిలిపివేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో రహదారులు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) ఆధ్వర్యాన చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలో రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణం, రోడ్ల విస్తరణ తదితర పనులు జరుగుతున్నాయి. అయితే, నెలల తరబడి ప్రభుత్వం నుండి చెల్లింపులు లేకపోవడంతో ఇకపై పెట్టుబడి పెట్టలేమంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వం నుంచి దశలవారీగా చెల్లించాల్సి ఉన్నా అలా జరకపోగా.. పూర్తయిన పనులకు కూడా బిల్లులు అందడం లేదని సమాచారం.

ఖమ్మం–ఇల్లెందు రోడ్డు విస్తరణకు బ్రేక్

ఖమ్మం–ఇల్లెందు మార్గంలో రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు సుమారు రూ.40 కోట్ల అంచనాతో నాలుగు లేన్లుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే, పనులు మొదలై ఏడాది కావొస్తున్నా ప్రారంభ దశలోనే ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.5కోట్ల మేర బిల్లు బకాయి ఉండడంతో పనులు నిలిపివేసినట్టు సమాచారం. రోడ్డు పనులకు వినియోగించే యంత్రాలను సైతం అక్కడి నుంచి తరలించడంతో పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే, స్థానిక అధికారుల ఒత్తిడితో ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా కల్వర్టుల వద్ద మాత్రం చిన్నచిన్న పనులు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇక ఖమ్మంలో రూ.200 కోట్ల నిధులతో తీగల వంతెన నిర్మిస్తుండగా కాంట్రాక్టర్‌కు సుమారు రూ.20 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉన్నట్లు తెలిసింది. పని చేస్తున్నా బిల్లులు రాకపోవడంతో అప్పులు పెరిగినందున ఇకపై చేయలేమంటూ కొద్దిపాటి పనులతో సరిపెడుతున్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన సముదాయం కాంట్రాక్టర్‌కు సైతం రూ.15 కోట్ల మేర బిల్లులు అందాల్సి ఉన్నట్లు తెలిసింది. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.100 కోట్ల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు సమాచారం. ఇక పూర్తయిన పనులన్నీ కలిపితే ఈ బకాయి భారీగా ఉంటుందని తెలిసింది.

ప్రభుత్వ స్పందనపైనే ఆశలు

ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో చేసిన పనులకు సంబంధించి బకాయిలు ఎప్పుడు విడుదల అవుతాయనే విషయంలో అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారని తెలిసింది. దీంతో కాంట్రాక్టర్లు చేసేదేం లేక పనులను మధ్యలో నిలిపివేస్తున్నారు. బకాయిల్లో కొంత మొత్తమైనా చెల్లిస్తేనే కాంట్రాక్టర్లు కొత్త పనులకు టెండర్లు దాఖలు చేసే అవకాశముందని చెబుతున్నారు. ఈనేపథ్యాన ప్రభుత్వ స్పందన కోసం అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు.

ఇతర జిల్లాలతో పోలిస్తే మెరుగే...



మిగతా జిల్లాలతో పోలిస్తే ఖమ్మం జిల్లాలో పనులు మెరుగ్గానే జరుగుతున్నాయి. ఎక్కడా కాంట్రాక్టరు పనులు నిలిపివేసినట్లు సమాచారం లేదు. అయితే, బిల్లుల కోసం మాత్రం ఒత్తిడి చేస్తున్నారు. పూర్తయిన, వివిధ దశల్లో ఉన్న పనులకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమర్పిస్తున్నాం.

– యాకూబ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

కొత్త పనులు కష్టమే..

ఇప్పటికే జిల్లాలో పూర్తయిన, పురోగతిలో ఉన్న పనులకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఈ నిధుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్న నేపథ్యాన కొత్త పనులకు పదేపదే టెండర్లు జారీ చేస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ విషయమై అధికారులు ఆరా తీస్తే పాత బిల్లులే ఇవ్వనప్పుడు కొత్త పనులు ఎలా చేస్తామని కాంట్రాక్టర్లు బదులిచ్చినట్లు తెలిసింది. అప్పుల్లో కూరుకుపోయిన తమకు ఇప్పటివరకు చేసిన పనుల బిల్లులు చెల్లించాకే టెండర్లపై ఆలోచన చేస్తామని చెప్పినట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలిసింది.

ప్రారంభమైన ఎప్‌సెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

- తొలిరోజు మొరాయించిన సర్వర్
- గంటల తరబడి వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఖమ్మం సహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మంగళవారం మొదలైంది. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటుచేయగా, ఉదయం 9నుంచి సాయంత్రం 6–30గంటల వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఉదయం 8–30గంటలకల్లా కేంద్రానికి చేరుకున్నారు. రెండు రోజుల నుంచి స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించగా, తొలిరోజు 570మంది విద్యార్థులకు గాను 510మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

ఇతర జిల్లాల నుంచి సైతం...

ఖమ్మంలోని ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కేంద్రానికి ఉమ్మడి జిల్లా నుంచే కాక సమీప జిల్లాల విద్యార్థులు సైతం హాజరయ్యారు. రాష్ట్రంలో ఎక్కడైనా కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం ఉండడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల విద్యార్థులు కూడా వచ్చారు. కాగా, సెంటర్ వద్ద పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల సిబ్బంది తమ కళాశాలల్లో చేరాలంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బ్రోచర్లు ఇస్తూ ప్రచారం చేయడం కనిపించింది.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

సర్వర్ మొరాయింపు

కౌన్సెలింగ్‌కు మొదటిరోజైన మంగళవారం ఎక్కువ మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో సర్వర్ మొరాయించింది. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన నత్తనడకన కొనసాగగా విద్యార్థులు, తల్లిదండ్రులు గంటల తరబడి వేచిచూడాల్సి రావడంతో అసహనానికి గురయ్యారు.

సీఎస్‌సీ ఎంచుకుంటా..



ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో చదవాలని నిర్ణయించుకున్నా. మా సోదరి అక్కడే చదువుతోంది. దీంతో నేను కూడా మంచి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ కమ్యూనికేషన్(సీఎస్‌సీ) కోర్సు చదవాలని భావిస్తున్నా.

– జి.కీర్తిప్రియ, పాతలింగాల

మంచి కళాశాల కోసం..



హైదరాబాద్‌లో మంచి కాలేజీ ఎంచుకునేలా జాబితా రూపొందించుకున్నా. ఈసీఈ కోర్సు చదవాలనేది లక్ష్యం. సరైన కళాశాలను ఎంచుకుంటే మంచి ఫలితం సాధించి త్వరగా ఉద్యోగం సాధించొచ్చనే నమ్మకం ఉంది.

– రాంచరణ్, ఖమ్మం

పోషకాహారంతో విద్యార్థుల ఎదుగుదల

పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ అనుదీప్



విద్యార్థిని పాఠం చదువుతుండగా వింటున్న కలెక్టర్ అనుదీప్, డీఈఓ సత్యనారాయణ

రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూనే నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని, తద్వారా వారి ఎదుగుదల ఆశాజనకంగా ఉంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు పద్యాలు, ఆంగ్లం పాఠాలు చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ మాట్లాడుతూ పాఠాలు చెప్పడం ఎంత ముఖ్యమో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించడాన్ని కూడా ఉపాధ్యాయులు బాధ్యతగా భావించాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ గది, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఉద్యోగుల హాజరును పరిశీలించారు. అలాగే, చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ సత్యనారాయణ, ఎంఈఓ రాములు, హెచ్‌ఎం కరుణకుమారి, వైద్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటే అంతా మంచే...

ఖమ్మంవైద్యవిభాగం: ఆరోగ్యం బాగా ఉంటే ఏ సమస్యనైనా అవలీలగా అధిగమించొచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యవృత్తి పవిత్రమైనదని, అందరికీ ఆరోగ్యాన్ని ప్రసాదించే వైద్యులకు తీవ్రమైన ఒత్తిడి ఉంటుందని తెలిపారు. ఈమేరకు విధినిర్వహణలో వారికి జిల్లా యంత్రాంగం నుంచి వందశాతం మద్దతు అందిస్తామని చెప్పారు. అనంతరం వైద్యులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేయగా, సీనియర్ వైద్యులను సన్మానించారు. డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, వైద్యులు కృపాఉషశ్రీ, నారాయణరావు, జగదీష్, బి.శ్రీనివాసరావు, చందునాయక్, వెంకటరమణ, బి.సైదులు, శ్రీరామారావు, మోతియా, రచ్చ శ్రవణ్ కుమార్, రమేష్, రత్నమనోహర్ పాల్గొన్నారు.

డంపింగే అసలు సమస్య...

జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సహా సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు నానాటికీ విస్తరిస్తున్నాయి. పల్లెల నుంచి జనాభా వస్తుండడంతో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. ఆయా నివాసాల నుంచి రెండు రోజులు లేదా మూడు, నాలుగు రోజుకోసారి చెత్త సేకరిస్తున్నా.. ఈ చెత్త డంప్ చేయడంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన ఏదులాపురం, కల్లూరు మున్సిపాలిటీల్లోనూ ఈ సమస్య నెలకొంది. ఖమ్మంలోని డంప్ యార్డును మార్చాలని సమీప కాలనీల ప్రజలు తరచూ ఆందోళనలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. చెత్త డంపింగ్, ఆపై నిర్వహణ లోపాలతో ఈ పరిస్థితి నెలకొనగా.. జిల్లాలోని కేఎంసీ సహా మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల సమస్యలపై 'సాక్షి' ఫోకస్.

సాక్షి ఫోకస్

కేఎంసీ సహా మున్సిపాలిటీలపై 'చెత్త' భారం

- సేకరిస్తున్న చెత్త తరలింపునకు ఇక్కట్లు
- ఖమ్మంలో డంపింగ్ యార్డ్‌ను మార్చాలని తరచూ ఆందోళనలు
- జిల్లాలోని మిగతా మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి



డంపింగ్‌యార్డ్‌లో గుట్టలుగా ఉన్న చెత్త

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ రోజు విడిచి రోజు కొనసాగుతోంది. ఈ చెత్తను దశాబ్దాల కాలంగా దానవాయిగూడెంలోని 38 ఎకరాల్లో విస్తరించిన డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. కానీ తడి, పొడి చెత్త కలిపే వాహనాల్లో వేసి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తుండడం.. అక్కడ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడం, 60 డివిజన్ల నుండి చెత్త వాహనాల రాకపోకలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్ చుట్టూ నివాసాల సంఖ్య పెరగడంతో కామంచికల్‌లోని ప్రభుత్వ స్థలంలో డంప్ చేయాలని నిర్ణయించారు. కానీ అక్కడ రైతులు అడ్డుకోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. మరోపక్క ఇంటింటా సేకరించిన చెత్తను రామన్నపేట మీదుగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం రోడ్డు నుంచి ఒక మార్గం, రాపర్తినగర్ బీసీ కాలనీ మీదుగా మరో మార్గంలో వాహనాల్లో తరలిస్తుండగా.. దుర్వాసన వస్తోందని, చెత్త తమ ఇళ్ల ముందు పడుతోందని స్థానికులు పలుమార్లు వాహనాలను అడ్డుకొని నిరసనలు తెలిపారు. దీంతో ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై పట్టాలు కట్టిస్తామని అధికారులు చెప్పినా అది అమలుకు నోచుకోవడం లేదు.

బయోమైనింగ్..

ఖమ్మంలో 4లక్షల జనాభా నివసిస్తుండగా నివాసాలు, షాపుల నుంచి ట్రాక్టర్లు, ఇతరత్రా కలిపి 129 వాహనాల్లో చెత్త తరలిస్తున్నారు. రోజువారీగా 180 టన్నుల చెత్త సేకరిస్తున్నట్లు అంచనా. అయితే, డంప్ యార్డులో వ్యర్థాలు పేరుకుపోయి స్థలం లేకపోవడంతో అధికారులు బయోమైనింగ్ ప్రారంభించి పదెకరాలకు పైగా స్థలాన్ని శుభ్రం చేయించారు. ఇందులో ఎనిమిది ఎకరాల్లో మొక్కలు నాటారు. ప్రస్తుతం ఏ రోజుకారోజు చెత్త శుభ్రం చేయించాలని ప్రణాళిక రూపొందించినా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు.



పట్టా లేకుండానే వ్యర్థాలను తరలిస్తున్న దృశ్యం

ఇళ్ల ముందే చెత్త..



డంపింగ్‌యార్డ్‌కు వచ్చివెళ్లే చెత్త వాహనాలతో ఇబ్బందిగా ఉంది. తీవ్ర దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. చెత్త తీసుకెళ్లే వాహనాలపై పట్టాలు కట్టి రోడ్డుపై పడకుండా చూస్తామని అధికారులు చెప్పినా డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. దీంతో వ్యర్థాలు ఇళ్ల ముందు పడుతున్నాయి.

– చట్టు అఖిల్, బీసీ కాలనీ, ఖమ్మం

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు



డంపింగ్ యార్డ్ షెడ్డులో కాకుండా ఆరు బయట చెత్త వేస్తున్న డ్రైవర్

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త డంపింగ్‌కు ఏర్పాటుచేసిన యార్డులు నిరుపయోగంగా మారాయి. మడుపల్లి సమీపంలో చెరువు లోతట్టు ప్రాంతంలో షెడ్లు నిర్మించగా.. ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసే షెడ్డు రేకులు ధ్వంసమయ్యాయి. ఈ షెడ్డు షట్టర్ తీయక నెలలు దాటుతుండడంతో అన్ని వ్యర్థాలను డంపింగ్ యార్డ్ సమీపాన ఆరుబయటే వేస్తున్నారు. అలాగే, యార్డ్‌లో కంపోస్ట్ ఎరువు తయారీకి చేసిన ఏర్పాట్లు కూడా నిరుపయోగంగా మారాయి. వారం, పదిరోజులకోసారి పట్టణంలో సేకరించే తడి, పొడి చెత్త కలిపి 1.50టన్నులు అవుతుండగా.. ప్రతిరోజు సేకరిస్తే కనీసం 3 టన్నులకు చేరే అవకాశం ఉంది. అంతా కలిపి కాకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంపింగ్ యార్డుకు తరలించి కంపోస్టు ఎరువు తయారీకి అవకాశమున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.



షట్టర్ తెరుచుకోని ప్లాస్టిక్ సేకరణ కేంద్రం

మారిస్తేనే ఫలితం



ఎన్నెస్పీ కాల్వ పక్కన యార్డులో వ్యర్థాలు

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీలో చెత్త డంపింగ్‌కు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్నెస్పీ కెనాల్ పక్కన డంపింగ్ యార్డ్ ఉండగా.. నిత్యం ఎనిమిది ట్రాక్టర్లు, రెండు ఆటోల్లో అక్కడి డంపింగ్ యార్డ్, కంపోస్ట్ షెడ్లకు తరలిస్తున్నారు. అయితే, డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడకు సమీపంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల ఉండడంతో విద్యార్థులు, వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ నుంచి డంపింగ్ యార్డ్‌ను దూరప్రాంతానికి మారిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని చెబుతున్నారు. అయితే, ఇంకోచోటకు మార్చేలా ప్రతిపాదించామని ఈఓ నాగేశ్వరరావు తెలిపారు.

డంపింగ్‌యార్డ్ మార్చండి



కల్లూరు ఎన్నెస్పీ కాల్వ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌తో మా ప్రాంతలో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులే కాక ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తక్షణమే డంపింగ్ యార్డ్‌ను మార్చాలి.

– ఏనుగుల అంజి, కల్లూరు

యార్డ్ ఉన్నా లేనట్లే...

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ 11 కిలోమీటర్ల దూరాన కొమ్మేపల్లిలో ఏడున్నర ఎకరాలలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటుచేశారు. ప్రతిరోజు 92 మంది పారిశుద్ధ్య కార్మికులు 12టన్నుల చెత్తను 15 ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తున్నారు. అలాగే, డంపింగ్‌యార్డ్‌లో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తున్నారు. కానీ కొందరు వాహనాల డ్రైవర్లు చెత్తను యార్డ్‌కు తరలించకుండా పాత ఎన్టీఆర్ కాల్వ సమీపాన వేస్తుండడంతో స్థానికులు ఆందోళనలకు దిగుతున్నారు. కొందరు సెప్టిక్ ట్యాంక్ వాహనాల నిర్వాహకులు వ్యర్థాలను ఇక్కడే డంప్ చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు.



పాత ఎన్టీఆర్ కాల్వ పక్కన వేసిన చెత్తాచెదారం

అటు వెళ్తేనే దుర్వాసన



పాత ఎన్టీఆర్ కాల్వ పక్కనే చెత్తా, చెదారం, జంతువుల కళేబరాలను వేస్తున్నారు. డంప్ యార్డుకు తీసుకెళ్లకుండా ఇక్కడ వేయడంతో ఇబ్బందులు ఎదురవుతునాయి. ఈ విషయంలో ఆందోళనలు చేసినా స్పందన లేదు. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల్లోనూ చెత్త తీసుకొచ్చి వేస్తున్నారు.

– గుత్తి నాగు, సత్తుపల్లి

వర్షాకాలంలో సమస్య

వైరా: వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతుండగా... డంపింగ్ యార్డు సమస్య మాత్రం కొలిక్కి రావడం లేదు. మున్సిపాలిటీ పరిధి లోని 20వార్డుల నుంచి 10 టన్నుల మేర చెత్త సేకరిస్తుండగా, వైరా సమీపంలోని తల్లాడ మండలం కొడవటిమెట్ట వద్ద మూడెకరాలను డంపింగ్ యార్డుకు కేటాయించారు. కానీ అక్కడకు నాలుగు కి.మీ.కు పైగా దూరం ఉండడంతో వాహనాల డ్రైవర్లు మార్గ మధ్యలోనే చెత్త వేస్తున్నారు. ఒకవేళ వెళ్లినా వర్షాకాలంలో వైరా రిజర్వాయర్ అలుగులు పొంగితే దారులు మూసుకుపోయాయి. ఇటీవల స్టేజీ పినపాక వంతెన సమీపాన చెత్త వేస్తూ నిప్పు పెడుతుండగా పొగతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి.



వైరాలో జాతీయ రహదారి వెంట వేసిన చెత్త

క్లుప్తంగా

బ్లడ్ బ్యాంక్‌లో డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని డాక్టర్స్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌ను డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి మంగళవారం తనిఖీ చేశారు. మహబూబాబాద్ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణతో కలిసి తనిఖీ చేసిన ఆమె రక్తసేకరణ, నిల్వలకు ఉన్న వసతులు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. శిక్షణ పొందిన వైద్యులు, సిబ్బందితో బ్లడ్ బ్యాంక్ నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ డెమో జి.సాంబశివరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

'సీగాచి' ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణం

ఖమ్మంమయూరిసెంటర్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సీగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో 45మందికి పైగా కార్మికులు మృతి చెందడం విషాదకరమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఈ ఘటన యాజమాన్యం నిర్లక్ష్యంతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. యాజమాన్యాలు ఫ్యాక్టరీల నిర్వహణను విస్మరించడంతోనే పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈమేరకు మరణించిన వారికి రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించడమేకాక ప్రమాదంపై న్యాయ విచారం జరిపించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగారావు డిమాండ్ చేశారు.

మానసిక దివ్యాంగులకు అండగా..



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖరరావు

ఖమ్మం లీగల్: పిల్లలు, మానసిక దివ్యాంగులకు న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలుస్తోందని సంస్థ జిల్లా సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు తెలిపారు. పిల్లలు, దివ్యాంగుల హక్కులపై పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఖమ్మంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలందరికీ బడికి పంపించేలా తల్లిదండ్రులకు, మానసిక దివ్యాంగులను సమాజంలో భాగమేనని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాక ఎవరైనా వివక్షతకు గురైతే న్యాయ సేవా సంస్థ ద్వారా సాయం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు దేవకి శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాస్‌శర్మ, పద్మ ప్రసూన, దిలీప్‌కుమార్, శ్రీనాథ్, యుగంధర్ పాల్గొన్నారు

తహసీల్దార్ల బదిలీ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్టులను భర్తీ చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చింతకాని తహసీల్దార్ అనంతరాజు ఉద్యోగ విరమణ చేయగా ఆ స్థానంలో కలెక్టరేట్ 'డీ' సెక్షన్ సూపరింటెండెంట్ టి.కరుణాకర్‌రెడ్డిని నియమించారు. అలాగే, చింతకాని డీటీ జి.వీరభద్రనాయక్‌ను ఖమ్మం ఐపీటీ రైల్వేస్‌కు ఖమ్మంకు బదిలీ చేయగా, అక్కడ ఉన్న జీఎస్‌కే.శర్మను కలెక్టరేట్ 'డీ' సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఇక ఎన్నికల సమయాన జిల్లాకు వచ్చిన పలువురు తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేస్తుండగా, జిల్లా నుంచి ముగ్గురి వారి సొంత జిల్లాలకు కేటాయించారు. ఎస్.సంపత్‌కుమార్, వి.రాఘవరెడ్డిని మహబూబాబాద్‌కు, సీహెచ్.స్వామిని సిద్దిపేట జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వరదయ్య నగర్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.4వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	6,400	5,600
కందులు	6,000	5,300
అలసంద	6,200	6,200
మిర్చి	12,000	6,200
ఏసీ మిర్చి	13,300	7,500
మిర్చి తాలు	6,000	5,000
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

లోటు వర్షపాతమే...

- జూన్‌లో కరుణించని వరుణుడు
- నెలంతా ఏడు రోజులే వాన
- ఫలితంగా ఊపందుకోని పంటల సాగు

ఖమ్మంవ్యవసాయం: గడిచిన జూన్ నెలలో జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో సగటున 131.2 మి.మీ. వర్షపాతం నమోదవుతుందని అంచనా వేయగా.. 123.9 మి.మీ.కే పరితమైనట్లు అధికారులు విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నారు. అంతేకాక నెల మొత్తంలో కేవలం ఏడు రోజులే వర్షం కురిసింది. జిల్లాలోని 21 మండలాలకు ఎనిమిది మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, పది మండలాల్లో సాధారణ వర్షపాతం, మూడు మండలాల్లో మాత్రం సాధారణానికి మించి వర్షపాతం నమోదైందని నివేదికలో వెల్లడించారు. ఈమేరకు సింగరేణి, కామేపల్లి, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, ఖమ్మం అర్బన్ మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, సాధారణానికి మించి కొణిజర్ల, పెనుబల్లి, తల్లాడలో వర్షపాతం నమోదైంది.

చివరి వారంలోనే..

మే నెల చివరి వారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సిన ఉండగా రోహిణి కార్తె ఆరంభంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అప్పటికి నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకలేదు. అయినా అప్పటి వర్షాలకు జిల్లాలోని రైతులు పత్తి, పెసర వంటి మెట్ట పంటలు విత్తుకున్నారు. కానీ జూన్ ఆరంభం నుంచి వర్షాలు మొఖం చాటేయడంతో అన్నదాతలు ఎదురుచూపుల్లో గడపాల్సి వచ్చింది. మృగశిర కార్తెలో ఒకటి, రెండు రోజులు చిరు జల్లులు కురవగా.. జూన్ 22న ఆరుద్ర కార్తె ప్రవేశించాకే వర్షాలు ప్రారంభమయ్యాయి. జూన్‌లో మొత్తం ఏడు రోజులేవర్షం కురవగా.. నెలాఖరులో కురిసిన వర్షాలతో కొంత మేర లోటు పూడినట్లయింది.



పత్తి మొలక స్థితిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

గత ఏడాదితో విస్తారంగా వాన

గత ఏడాది జూన్ నెలలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆ నెలలో జిల్లా సగటు వర్షపాతం 124.6 మి.మీ.కు గాను 197.8 మి.మీ.గా నమోదు కావడం విశేషం. కానీ ఈసారి జూన్‌లో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది.

నత్తనడకన సాగు

ఆలస్యంగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పంటల సాగు నత్తనడకన సాగుతోంది. జిల్లాలో ఈ వానాకాలం అన్ని పంటలు కలిపి 6,07,165 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా, జూన్ చివరి వరకు 2,12,997 ఎకరాల్లోనే పంటలు వేశారు. తొలకరిలో సాగు చేయాల్సిన మెట్ట పంటల సాగు లక్ష్యం భారీగావెనకబడింది. పత్తి లక్ష్యం 2,20,550 ఎకరాల్లో 1,35,114 ఎకరాల్లోనే విత్తనాలు నాటారు. ఇక పెసర 17,790 ఎకరాలకు గాను 6,549 ఎకరాల్లో, పచ్చిరొట్ట సుమారు 54 వేల ఎకరాల్లో వేశారు. అలాగే, జిల్లాలో ప్రధాన పంటగా సాగయ్యే వరి లక్ష్యం 2,95,100 ఎకరాలు కాగా, ఇప్పటివరకు నేరుగా, నాటు పద్ధతిలో 16,142 ఎకరాల్లో పంట వేశారు. మరో 34,359 ఎకరాలకు సరిపడా నార్లు పోశారు. వర్షాలు జోరందుకుని, నాగార్జునసాగర్ నుంచి నీరు విడుదలైతే జూలై, ఆగస్టు నెలల్లో పంటల సాగు లక్ష్యాన్ని చేరే అవకాశముంది.

గత నెలలో మండలాల వారీగా నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	నమోదు అంచనా	నమోదైన వర్షపాతం
సింగరేణి	144.2	81.6
కామేపల్లి	142.1	93.0
రఘునాథపాలెం	130.9	99.4
ఖమ్మం రూరల్	129.1	131.6
తిరుమలాయపాలెం	115.2	93.6
కూసుమంచి	112.8	53.2
నేలకొండపల్లి	117.1	87.6
ముదిగొండ	111.5	82.4
చింతకాని	120.9	87.6
ఖమ్మం అర్బన్	133.3	101.6
కొణిజర్ల	124.6	164.4
ఏన్కూరు	151.0	141.0
కల్లూరు	139.8	156.2
పెనుబల్లి	136.8	182.0
సత్తుపల్లి	152.6	168.2
వేంసూరు	135.6	156.6
తల్లాడ	133.7	200.6
వైరా	133.1	149.8
బోనకల్	123.8	127.6
మధిర	126.1	123.6
ఎర్రుపాలెం	137.4	120.6

జిల్లా వ్యాప్తంగా వర్షం

జిల్లాలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవగా, మంగళవారం సైతం జల్లులు కొనసాగాయి. అయితే, జిల్లాకు సరిహద్దుగా ఉన్న మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కురిసిన వర్షంతో మున్నేరు, ఆకేరు నుంచి ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి స్వల్పంగా మొదలైన వరద మరింత పెరుగుతోంది. ఇప్పటికే ఖమ్మంలోని కాల్వొడ్డు వద్ద తీగల వంతెన నిర్మాణం కారణంగా చప్టాపై రాకపోకలు నిలిపేశారు. దీంతో ఖమ్మం కాల్వొడ్డు మీదుగా నాయుడుపేట, వరంగల్ క్రాస్ వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, మంగళవారం జిల్లాలో 3.08 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కల్లూరు మండలంలో అత్యధికంగా 6.22 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. సత్తుపల్లిలో 5.72, కామేపల్లిలో 4.24, తల్లాడలో 3.94, పెనుబల్లిలో 3.72, కొణిజర్లలో 3.68, తిరుమలాయపాలెంలో 3.48, రఘునాథపాలెంలో 3.42, ఏన్కూరు, వేంసూరులో 3.28, ఖమ్మం అర్బన్‌లో 3.24, వైరా 3.22, ఖమ్మం రూరల్‌లో 2.88, సింగరేణి, ఎర్రుపాలెంలో 2.54, నేలకొండపల్లిలో 2.36 సెం.మీ.ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.



ఏన్కూరు : నిమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చేపలు పడుతున్న స్థానికులు

జల వనరుల కళకళ

- వర్షాలతో నిండుతున్న చెరువులు
- గాలీవానతో కొన్నిచోట్ల కూలిన స్తంభాలు, చెట్లు

వైరారూరల్/కల్లూరురూరల్/ఏన్కూరు/ముదిగొండ/తల్లాడ: జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారు వరకు గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల చెరువులు జలకళ సంతరించుకోగా.. గాలీవానతో చెట్లు, స్తంభాలు కూలడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలోని నల్లకుంట చెరువుకు ఎగువ నుంచి వరద చేరగా చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 6.5 అడుగులకు చేరడంతో అలుగు పోస్తోంది. ఇక వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, ప్రస్తుతం 15.5 అడుగులకు చేరింది. కాగా, కల్లూరు మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 62.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లయ్య బంజరు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తుండగా తాత్కాలికంగా బ్రిడ్జి పక్కనే వేసిన మట్టిరోడ్డుపైకి నీరు చేరడంతో కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా మున్సిపాలిటీ అధికారులు మరమ్మతులు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు. అలాగే, ఏన్కూరు మండలంలో గురుకుల విద్యాలయం సమీపానే కాక పలుచోట్లు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. జన్నారం–



కల్లూరు రూరల్ : పుల్లయ్యబంజరు వాగు ఉధృతితో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

ఆరికాయలపాడు మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాక ముదిగొండలోని ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడగా వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సీఐ ఓ.మురళి సిబ్బందితో చేరుకుని చెట్టును తీయించారు. అంతేకాక తల్లాడ మండలంలోని కల్లూరు వాగు పొంగి ప్రవహించడంతో వెంగన్నపేట–నూతనకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంగన్నపేట సమీపాన వాగుపై వంతెన నిర్మిస్తుండగా, పక్కనే లోలెవల్ కాజ్‌వేపైకి నీరు చేరడంతో ఈ పరిస్థితి ఎదురైంది.



వైరా రూరల్ : అలుగు పోస్తున్న సోమవరం నల్లకుంట చెరువు



ముదిగొండ : రోడ్డుపై విరిగిపడిన చెట్టు

లాభం ఎంత.. నష్టం ఎంత?

చెక్‌డ్యాంల కూల్చివేతపై నివేదిక ఇవ్వాలన్న ఈఎన్‌సీ



ఖమ్మం ప్రకాశ్‌నగర్ వద్ద చెక్‌డ్యాం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో మున్నేరుపై నిర్మించిన చెక్‌డ్యాంలతో ఏ మేర వరద ముప్పు ఉంది... కొద్ది మేర ఎత్తు తగ్గించాలా, పూర్తిగా తొలగించాలా అన్న అంశంపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని జిల్లా జలవలనరుల శాఖ అధికారులను ఈఎన్‌సీ ఆదేశించినట్లు తెలిసింది. గత ఏడాది మున్నేటికి భారీగా వచ్చిన వరదతో ఖమ్మం నగరంతోపాటు రూరల్ మండలంలోని పలు కాలనీలు నీట మునిగాయి. అయితే, ఈ ముంపునకు ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరుపై నిర్మించిన చెక్‌డ్యామే కారణమని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు భావించారు. చెక్‌డ్యాం తొలగిస్తే వరద ముంపు ఉండదని ప్రతిపాదించగా.. ఇదే సమయాన చెక్‌డ్యాం ఉండడం వల్లే నగరంలో భూగర్భజలాలు పెరిగాయని ఇంకొందరు వాదన వినిపించారు. ఒకవేళ చెక్‌డ్యాం తొలగిస్తే రూ.7 కోట్ల నిధులు వృథా అవుతాయని వెల్లడించారు. ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద ఎనిమిది అడుగులు, రంగనాయుల గుట్ట ప్రాంతంలో ఆరు అడుగుల ఎత్తులో చెక్‌డ్యాంలు ఉన్నాయి. ఈమేరకు రెండు చెక్‌డ్యాంలు కూల్చివేయాలా, రంగనాయుల గుట్ట చెక్‌డ్యాం మాత్రమే తొలగించాలా.. లేక ఎత్తు తగ్గిస్తే సరిపోతుందా అన్న అంశాలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఆదేశించినట్లు తెలిసింది. అంతేకాక చెక్‌డ్యాంల కింద ఆయకట్టు, ఉపాధి పొందుతున్న మత్స్యకారుల వివరాలు, వీటితో పెరిగిన భూగర్భ జలాల వివరాలను సైతం నివేదికలో పొందుపర్చాలని సూచించినట్లు సమాచారం. ఈమేరకు జిల్లా అధికారులు సమగ్రమైన నివేదిక రూపకల్పనలో నిమగ్నమైనట్లు తెలిసింది.

జిల్లాలో సరిపడా ఎరువులు



మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

పెనుబల్లి: జిల్లా రైతాంగానికి ఈనెలలో కావాల్సిన మేర ఎరువులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. పెనుబల్లి రైతు వేదికలో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఎరువులు, పురుగుల మందుల డీలర్లతో సమావేశమై సూచనలు చేశారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువులను ఎవరైనా బ్లాక్ చేయాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓ ఏవీఎస్ఎస్.రాజు, ఏఈఓలు నరేష్, భవాని, నర్మద పాల్గొన్నారు.

సమ్మెతో కేంద్రం విధానాలపై నిరసన

అఖిలపక్షం సమావేశంలో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం తోట రామాంజనేయులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేలా మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈమేరకు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నందున సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి కేంద్రానికి కనువిప్పు కలిగించాలని కోరారు. వివిధ పార్టీల నాయకులు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, గాదె లక్ష్మీనారాయణ, సీతామహాలక్ష్మి, కళ్యాణం వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటేశ్వర్లు, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్ గౌడ్, ఎండీవై.పాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దండి సురేష్

యువకుడి బలవన్మరణం

రఘునాథపాలెం: నాయనమ్మ మృతితో మనోవేదనకు గురైన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడికి చెందిన భూక్యా కుమార్(29) ఓ ప్రైవేట్ విత్తన సంస్థలో పనిచేస్తున్నాడు. జూన్ 29న ఆయన నాయనమ్మ వరాలి మృతి చెందగా మనస్తాపంతో అదేరోజు గడ్డి నివారణ మందు తాగాడు. దీంతో కుటుంబీకులు చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. కుమార్‌కు భార్య, కుమార్తె ఉండగా, కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

జానకీపురం హెచ్‌ఎంపై చర్యలకు ఆదేశం



హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

బోనకల్: మండలంలోని జానకీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసకుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ.25వేల నిధులతో కొనుగోలు చేసిన క్రీడాసామగ్రి, బిల్లులపై ఆరా తీయగా అవన్నీ బీరువాలో ఉన్నాయని, తాళాలు సెలవులో ఉన్న పీఈటీ వద్ద ఉన్నాయని హెచ్‌ఎం చెప్పడంతో అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడిన ఆమె ఇక్కడ విధులు నిర్వర్తించేందుకు శ్రీనివాసకుమార్ సరిపోందున ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనతరం పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరీక్షించిన అదనపు కలెక్టర్..బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈఓ దామాల పుల్లయ్య పాల్గొన్నారు.

లారీ బోల్తా.. ఉల్లిగడ్డలు మాయం!



బోల్తా పడిన లారీ

వైరా: ఉల్లి గడ్డల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడగా.. అందులోని ఉల్లిగడ్డలను స్థానికులు తీసుకెళ్లిన ఘటన వైరా మున్సిపాలిటీ శివారు శాంతినగర్‌లో మంగళవారం జరిగింది. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డల లోడుతో రాజమహేంద్రవరం వెళ్తున్న లారీ మంగళవారం తెల్లవారుజామున అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్టును ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయం తెలియడంతో శాంతినగర్, దిద్దుపూడి గ్రామస్తులు చేరుకుని దొరికనంత మేర ఉల్లిగడ్డల బస్తాలు తీసుకెళ్లారు. ఆతర్వాత చేరుకున్న లారీ యజమానులు మరో లారీలో ఉల్లిగడ్డలను పంపించారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

ఖమ్మంమయూరిసెంటర్: పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐకే దక్కుతుందని చెప్పారు. ఇదే సమయాన కాలనీల్లో వసతుల కల్పన, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందే వరకు పోరాడుతామని తెలిపారు. కాగా, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలు అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు మహ్మద్ మౌలానా, ఎస్.కే.జానీమియా, మహ్మద్ సలాం, బీ.జీ.క్లెమెంట్, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, అజ్మీరా రామ్మూర్తి, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, ఎస్.కే.సైదా, బోడా వీరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

లాభాల పేరిట నగదు స్వాహా

చింతకాని: ప్రముఖ సంస్థల్లో పెట్టుబడి పెడితే నగదు రెట్టింపు అవుతుందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.28,900 స్వాహా చేశారు. మండలంలోని నాగులవంచకు చెందిన మొగిలి అశోక్ సెల్‌ఫోన్‌కు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసి కొంత నగదు పెట్టుబడి పెడితే రెట్టింపవుతుంని నమ్మించడంతో ఆయన లింక్‌ను ఓపెన్ చేయగానే ఖాతా నుంచి ఉన్న రూ.28,900 నగదు మాయమైంది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన అశోక్ చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం సదాశివునిపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సదాశివునిపేటకు చెందిన పరిమి లక్ష్మయ్య(51) సైకిల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఆరెంపుల రోహిత్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో మంగవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న కారు, డీసీఎం



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న ఎస్సై రామారావు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా కారు, డీసీఎం వ్యాన్ ఢీకొన్నాయి. వైరా వైపు నుండి తల్లాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకున్నా ప్రధాన రహదారిపై ప్రమాదం జరగడం, భారీ వర్షం కురుస్తుండడంతో రాకపోకలు నిలిచిపోగా ఎస్సై పుష్పాల రామారావు, సిబ్బందితో చేరుకుని జేసీబీతో వాహనాలను పక్కకు తప్పించారు. దీంతో రాకపోకలు మొలయ్యాయి.